క్లుప్తంగా

నగదు అందజేత



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థి చకినరావు దివ్య పదవ తరగతిలో స్కూల్ టాపర్‌గా వచ్చిన సందర్భంగా టీచర్స్ డేను పురస్కరించుకొని సర్పంచ్ వెన్నపురెడ్డి వసంతమోహన్‌రెడ్డి రూ.5వేల నగదును ప్రోత్సాహంగా అందజేశారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థికి అందజేసి విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అమలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేయూత



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లి గ్రామానికి చెందిన పోతునూరి రవితేజ నీట్ ర్యాంక్ సాధించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం చేసి చేయూతనందించారు. 10వ తరగతి వరకు రవితేజ జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే పదో తరగతి వరకు చదివి ఇంటర్ వరంగల్‌లో పూర్తి చేసి ఈ ఏడాది నిర్వహించిన నీట్ పరీక్షకు హాజరై మంచి ర్యాంక్ సాధించి మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మంగళవారం ఉపాధ్యాయ బృందంతో కలిసి నగదు అందజేశారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

టేకుమట్ల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ పుల్ల కరుణాకర్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఎస్సై గట్ల సుదాకర్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తప్పవని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం కిష్టరావుపేట గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండ కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. సివిల్ సిఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందుతుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు సుభాష్ కాలనీ, రాంనగర్ అంగన్‌వాడీ సెంటర్లో పోషకాహార మాసోవత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ హాజరై పిల్లలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, ఉమామహేశ్వరి తదిరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

చిట్యాల: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చల్లగరిగ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చల్లగరిగ గ్రామానికి చెందిన ఓదెల చంద్రయ్య (64) అనే వృద్ధుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రెండవ ఎస్సై ఎండీ.శాఖాన్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతిడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని వజినపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి శ్రీకాంత్ పాడి గేదె మేతకు వెళ్లి వస్తున్న క్రమంలో ఓ ఇంటిపైనున్న సర్వీసు వైరు తెగి గేదెకు తగిలింది. దీంతో షాక్ గురై గేదె అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ సుమారుగా రూ.55,000లు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.



కాటారం: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు



కాటారం: వివేకానంద పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం



పలిమెల: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయును విద్యార్థులు, పలువురు నాయకులు సన్మానించారు. పలు పాఠశాలల్లో స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పలువురు మాట్లాడుతూ.. రాధాకృష్ణన్ సాధించినటువంటి గొప్ప కీర్తి పేరు ప్రతిష్టలను వివరించారు.

\- సాక్షి నెట్‌వర్క్



మల్హర్: సన్మానిస్తున్న నాయకులు



మల్హర్: రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులరిస్తున్న అధ్యాపకులు



మహదేవపూర్: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



మహాముత్తారం: మీనాజీపేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు



మహాముత్తారంలో..



రేగొండ వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో..



రేగొండ మండలం రంగయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో..



చిట్యాలలో..



మొగుళ్లపల్లిలో..



రేగొండ మండలం రామన్నగూడెంతండాలో..



పలిమెల: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాళేశ్వరం హైస్కూల్‌లో..



చిట్యాల: హెచ్‌ఎం సత్యనారాయణను సన్మానిస్తున్న విద్యార్థులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కాటారం : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, డీఈఓ రామ్‌కుమార్ సన్మానించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ చల్ల సునీత, విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్‌లను శాలువాలతో సత్కరించి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా సునీత, వెంకటేశ్ ఎంపికవడం పట్ల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, మజీద్‌పల్లి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామగుండం రామ్మూర్తి, శ్రీపాల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు.



ప్రిన్సిపాల్ సునీతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

13న ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈఓలు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఈనెల 13న ముహూర్తాన్ని ఖరారు చేసినట్లు ఈఓ మహేష్, చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆలయ అర్చకులు, ధర్మకర్తల మండలితో ప్రత్యేకంగా చైర్మన్, ఈఓలు సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. అచ్చలాపురం వేదపండితులతో చర్చించి తేదీని ఖరారుచేసినట్లు తెలిపారు. దేవాదాయశాఖ ఏఈతో ప్రతిష్ఠ జరిగే స్థలంలో మార్కింగ్ చేశారు. గతేడాది భారీ వర్షాలకు ధ్వజస్తంభం నేలమట్టం అయిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు దేవస్థానం అధికారులు, పాలకమండలి ప్రతిష్ఠకు శ్రీకారం చుట్టడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, దేవేందర్, రాజయ్య, ఎక్స్అఫిషియో మెంబర్ త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, అర్చకుడు ఫణీంద్రశర్మ ఉన్నారు.


సమన్వయంతో పనిచేయాలి

మహాముత్తారం: అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ రత్నం సుభద్ర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనుల డబ్బులు రావడం లేదని పలువురు సభ్యులు సభదృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా అయా గ్రామాల సర్పంచ్‌లు ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు సంబంధించిన ఎంబీలు త్వరగా రికార్డు చేయాలని సభదృష్టికి తీసుకు రాగా స్పందించిన ఎంపీపీ సంబంధిత డీఈకీ ఎంబీలు రికార్డు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంపీటీసీలు లక్కిరెడ్డి నర్సింహారెడ్డి, శ్రీపతి సురేష్, జాటోత్ వసంత, పుట్టపాక రాద, సీడీపీఓ రాధిక, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు నజీర్ ఖాన్, సర్పంచ్‌లు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుబద్ర

తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న వెంకటేష్

చిట్యాల : అంగన్‌వాడీ టీచర్లు ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకటేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుమన్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు త్రివేణి, ప్రతిభ, జ్యోతి పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ ప్రారంభం

మల్హర్: సీతారామ సేవా సదన్ మంథని వారి సహకారంతో మండలంలోని తాడిచర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను సీతారామ సేవ సదన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రటరీ గణపతి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన సదన్ వారిని పాఠశాల హెచ్‌ఎం కుమారస్వామి అభినందించి, సన్మానించారు. సదన్ మెంబర్లు మనోహర్‌రావు, రాధకిషన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో చోరీ

కాటారం: మండల కేంద్రంలోని గారెపల్లి శ్రీపాద కాలనీలో లచ్చయ్య ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై మంగళవారం కేసు నమోదైనట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రాఖీ పండగ సందర్భంగా లచ్చయ్య కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 31న మహాముత్తారం మండలం బోర్లగూడెంకు వెళ్లి ఈ నెల 3న ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి ముందు మేయిన్ గేట్ తాళం వేసింది వేసినట్టుగానే ఉండగా ఇంటి ప్రధాన ద్వారం తాళం పగలగొట్టిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో దాచిన రూ.1.50 లక్షల రూపాయలను దొంగలు అపహరించుకుపోయినట్లు బాధితుడు లచ్చయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

‘డ్యూటీ సరిగా చేయమంటే కక్ష కట్టారు’

కాళేశ్వరం: డ్యూటీ సరిగ్గా చేయమని చెప్పినందుకు ఉపాధ్యాయులు తనపై కక్ష కట్టారని కాళేశ్వరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమలరెడ్డి ఏటీడీఓ దేశీరామ్‌నాయక్‌కు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయురాలిపై తోటి ఉపాధ్యాయులు కలెక్టర్‌కు ఫిర్యాదు విషయం తెలిసిందే. కావాలనే తనపైన అవాస్తవాలు, ఆరోపణలు చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయండి

కాటారం: మండల కేంద్రంలో నిర్మించిన వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్)లో నిరుద్యోగ యువతకు నిత్యం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, కాంగ్రెస్ నాయకులు మంగళవారం వైటీసీలో ఐటీడీఏ ఏటూరునాగారం అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి వసంతరావుకు వినతిపత్రం సమర్పించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి రంగాల్లో శిక్షణ కల్పించాలనే లక్ష్యంతో వైటీసీని నిర్మించడం జరిగిందని కానీ ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో నిరుపయోగంగా మారిపోతుందని పేర్కొన్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన వైటీసీ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతుందని ఏపీఓ దృష్టికి తీసుకెళ్లారు. నిరుద్యోగ యువతకు ఉపాధి రంగాల్లో నైపుణ్యం పెంపొందించేలా నిరంతరం శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు పసుల రాజమౌళి, కొట్టె జనార్దన్, కొట్టె శ్రీహరి, చీమల రాజు, రూపేష్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టీఎస్ఎస్ ఉద్యోగుల దీక్షలు



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపడుతున్న ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతామని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా ప్రధానకార్యదర్శి తోకల వేణు అన్నారు. విద్యాశాఖ -సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రెండవ రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ 15సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ దీక్షల్లో గౌరవ అధ్యక్షుడు చాంద్ పాషా, జాక్ నాయకులు సంపత్, చంద్రమౌళి, ఉమాదేవి, ఇందిర, రాజు, కుమార్, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ పండుగ



తీజ్ ఉత్సవాల్లో గిరిజనులు

చిట్యాల : మండలంలోని అందుకుతండా గ్రామంలో మంగళవారం గిరిజన మహిళలు తీజ్ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పండుగను గ్రామ పెద్ద ఆజ్మీర నందునాయక్ ప్రారంభించి మాట్లాడారు. పండుగను తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. అవివాహిత యువతులు ఒక్కపొద్దుఉంటూ ఒక బుట్టలో గోధుమలు వేసి తొమ్మిది రోజుల పాటు నీళ్లు పోస్తారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద, పూజారి బానోత్ రాజు నాయక్, కారోబార్ బానోత్ సీతారాం నాయక్, రాజ్ నాయక్, సమ్మయ్య, కళ్యాణ్ సింగ్, సమ్ములాల్ తదితరులు పాల్గొన్నారు.

‘మంచోడైతే గన్‌మెన్లు ఎందుకు?’

పలిమెల: పీఎస్‌సీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి మంచోడైతే అతడికి గన్‌మెన్లు ఎందుకు అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పలిమెలలో నారాయణరెడ్డి అతడి బినామీ పేర్ల మీద ఎక్కించిన భూములు సర్వే నంబర్లతో సహా తన వద్ద ఉన్నాయన్నారు. దమ్ముంటే ఒక్కసారి పలిమెలకు వచ్చి ప్రజలతో మాట్లాడి పోగలవా? అని సవాల్ విసిరారు. నారాయణరెడ్డి లీడర్ కాదని, చీటర్, బ్రోకర్, కబ్జా కోరు అని రైతుల ఉసురుపోసుకున్న రాబంధువు అని ఆరోపించారు. గులాబీ కండువా వేసుకొని కోవర్ట్ రాజకీయాలు చేసే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇంకొసారి పుట్ట మధు జోలికి వస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.